తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
శనివారం
13 జూన్ 2026
పేజీలు : 8
Follow :




## పేదల సంక్షేమం అభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

○ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

○ ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేత

○ ప్రతి పేద కుటుంబ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఖమ్మం రూరల్,జూన్ 12 (జనంసాక్షి):** పేదల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని రాంలీలా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడం ద్వారా వారి సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని మిగతా 2లో

## ప్రజా ఆస్తుల రక్షణే ధ్యేయం

○కృష్ణ చైతన్య వెంచర్‌లో మున్సిపాలిటీ 'ఆపరేషన్ ప్రొటెక్షన్'..

○చండూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

○కృష్ణ చైతన్య వెంచర్‌లో మున్సిపాలిటీ 'ఆపరేషన్ ప్రొటెక్షన్'..

○5,042 గజాల స్థలం స్వాధీనం! ○చుట్టూ ఫెన్సింగ్, బోర్డులు ఏర్పాటు..




**చండూరు, జూన్ 12 (జనంసాక్షి):** ప్రభుత్వ, ప్రజా ఆస్తులను అక్రమంగా ఆక్రమించి, విక్రయాలకు పాల్పడే వారిపై చండూరు మున్సిపాలిటీ అధికారులు ఉక్కుపాదం మోపారు. మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణ చైతన్య వెంచర్‌లో నిబంధనల ప్రకారం ప్రజా ప్రయోజనాలు, మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన 10 శాతం భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేయగా.. అధికారులు శుక్రవారం వాటిని తొలగించి, భూమిని తిరిగి మున్సిపాలిటీ స్వాధీనంలోకి తీసుకున్నారు.

**అసలేం జరిగిందంటే..?**

గతంలో కృష్ణ చైతన్య వెంచర్ లేఅవుట్ ఆమోదం పొందిన సమయంలో, అప్పటి నిబంధనల ప్రకారం మిగతా 2లో




### రైతు భరోసా పథకం భారంగా మారిందా..?

## ఉన్నట్లా.. లేనట్లా..?

○తీవ్ర నిరాశ నిస్పృహల్లో రైతాంగం..

○నిలిచిన మూడో విడత నిధులు..

○ఎదురుచూపుల్లోనే ముగిసిన యాసంగి..

○మళ్లీ వడ్డీ వ్యాపారుల కోరల్లోకి రైతులు..

○మునుగోడు నియోజకవర్గ రైతుల్లో తీరని ఆవేదన.!

**చండూరు,జూన్ 12 (జనంసాక్షి)**
యాసంగి సీజన్ ముగిసి, పండించిన ధాన్యం విక్రయాలు కూడా పూర్తయినప్పటికీ.. మునుగోడు నియోజకవర్గంలోని రైతాంగానికి పెట్టుబడి సాయం అందకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చెపుకుంటున్న 'రైతు భరోసా' పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఇక్కడి మండలాల రైతులు వాపోతున్నారు. వానాకాలం సీజన్ పనులు అప్పుడే ప్రారంభమైనప్పటికీ, గత యాసంగికి సంబంధించిన పూర్తి నిధులు విడుదల కాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. యాసంగి సీజన్ ప్రారంభంలోనే అందించాల్సిన భరోసా నిధులను ప్రభుత్వం విడతలవారీగా ఆలస్యంగా ప్రవేశపెట్టింది. ఎకరానికి రూ. 6 వేల చొప్పున మొదటి విడతలో ఒక ఎకరం భూమికి, మిగతా 3లో




## ప్రభుత్వ విద్య? ప్రైవేటు విద్య?" ఏది మంచిది.!!?

✹మేధావి పాఠశాల వల్ల కాదు... సంకల్పం వల్ల తయారవుతాడు!

✹ఆంగ్లం భాషా భయం-విద్యను వ్యాపారంగా మార్చింది.

✹చదువు కాదు మారింది తల్లిదండ్రుల మనస్తత్వం మారింది.

✹భయంతో పిల్లల బాల్యాన్ని తాకట్టు పెడుతున్నారు..

✹మేధావి పాఠశాల వల్ల కాదు-సంకల్పం వల్ల తయారవుతాడు..

**మణుగూరు, జూన్ 12 (జనంసాక్షి):**
"ప్రభుత్వా? ప్రైవేటా?" ఏ పాఠశాల మంచిదని మధ్యతరగతి తల్లిదండ్రులు మదన పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో లేనిది ప్రైవేటు పాఠశాలల్లో ఏముంటుంది..ప్రభుత్వ పాఠశాల చదువు మేధావులను ఇవ్వలేదా? మరి ప్రైవేట్ పాఠశాలల వైపు పరుగెందుకు? ఒకప్పుడు దేశాన్ని నడిపిన మేధావులు, శాస్త్రవేత్తలు, అధికారులు, ఉపాధ్యాయులు అందరూ ప్రభుత్వ పాఠశాలల నుంచే వచ్చిన వారే. అప్పుడు స్మార్ట్ బోర్డులు లేవు, ఎయిర్ కండిషన్ గదులు లేవు, ఖరీదైన ఫీజులు లేవు. కానీ చదువుపై శ్రద్ధ, గురువుపై గౌరవం, క్రమశిక్షణ ఉండేవి. అలాంటి ప్రభుత్వ పాఠశాల చదువు మిగతా 3లో

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించండి : ఎర్ర కవిత సర్పంచ్ గుజ్జ

**సంస్థాన్ నారాయణపురం జూన్ 12 (జనంసాక్షి):** సంస్థాన్ నారాయణపూర్ మండలం గుజ్జ గ్రామంలోని ఎస్సీ కాలనిలో బడి బాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్ర కవిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో చదువు కునే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా నాణ్య మైన విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ రెండు జతల స్కూల్ యూనిఫామ్స్ రాగి జావ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం తో పాటు ఈ విద్యా సంవత్సరం 22 వస్తువులతో కిట్ తో పాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేయబోతుంది. కావున మన గ్రామంలో తల్లిదండ్రులు మీ పిల్లాలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మన బడిని మనమే అభివృద్ధి చేసుకుందాము అని అన్నారు. ఈ సందర్భంగా కొంత మంది తమ పిల్లలను ప్రాథమిక పాఠశాల హరిజన వాడ గుజ్జ లో చేర్పించడం జరిగింది. చేర్పించిన పిల్లల తల్లిదండ్రు లను సర్పంచ్ ఎర్ర కవిత అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు బోయ రాములు టీచర్ బి.మంజుల , గ్రామ కార్యదర్శి కడగంచి అమరేందర్, వార్డ్ సభ్యులు దోటి రాములు,ఎర్ర మౌనిక,ఏ ఎన్ ఎం లు సింగపంగ రమణ, పి.మంజు ఆశ వర్కర్ శోభ, తల్లిదండ్రులు ఎర్ర చిన్న లింగస్వామి వెన్నెల,ఎర్ర అశ్విని, ఎర్ర జ్యోతి ,ఎర్ర సమత ,ఎల్లయ్య, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.




# పేదల సంక్షేమం అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ వినయందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



**నేరేడుచర్ల (జనంసాక్షి):**
ప్రజా పాలనబిప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదిరెడ్డి మాట్లాడుతూ. సమాజం నుండి డ్రగ్స్,గంజాయిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గంజాయి వినియోగం వలన పిల్లలు, యువత అనారోగ్యాల బారిన పడుతున్నారని,బంగారు భవిష్యత్తును కోల్పోతున్నార న్నారు. డ్రగ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యమై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారని, గంజాయి రవాణాపై నిఘా ఉంచామన్నారు. అనంతరం స్థానిక ప్రజలతో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మన చండూరు - మనం మార్చుకుందాం..

### అనే లక్ష్యంతో చండూరు వాళ్ల ప్రత్యేక కార్యక్రమం ?

### 1వ వార్డులో విజయవంతం

**చండూరు, జూన్ 12(జనంసాక్షి) :**
చండూరులోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చండూరు వాళ్లు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం 1వ వార్డులో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా చండూరు వాళ్ల టీమ్ సభ్యులు 1వ వార్డులో పర్యటించి స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలు, రోడ్ల సమస్యలు, ఇంటి ముందున్న సమస్యలు, పందుల బెడద, దుర్వాసనలు, ఇతర ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని నమోదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను చండూరు వాళ్ల టీమ్ సభ్యులకు వివరించారు. అలాగే మీడియా ప్రతినిధులు కూడా ప్రజల అభిప్రాయాలను సేకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని చండూరు వాళ్ల ప్రతినిధులు తెలిపారు. ప్రజల నుండి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, రాబోయే రోజుల్లో మిగతా వార్డుల్లో కూడా ఇదే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చండూరు వాళ్ల టీమ్ సభ్యులు, స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా?

### లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన

**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 12 (జనం సాక్షి)**
డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అధికారులు సూచించారు. ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం, యాదాద్రి భువనగిరి లీడ్ బ్యాంక్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలోని టైమ్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన "ఈ-బాట్" అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు డిజిటల్ చెల్లింపులు, యూపీఐ వినియోగం, సురక్షిత ఆన్‌లైన్ బ్యాంకింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా ఓటీపీలు, పాస్‌వర్డ్లు, పిన్ నంబర్లను ఇతరులతో పంచుకోరాదని, అనుమానాస్పద లింకులు, కాల్స్, సందేశాలకు స్పందించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైనట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారులు అనుపమ శిండే, మనోజ్ కుమార్ గరిపల్లి, లీడ్ బ్యాంక్ అధికారి శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్లు సాయి కుమార్, అనిల్, నరేష్, విద్యార్థులు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.






# పిల్లల చేతుల్లో పనిముట్లు కాదు,పుస్తకాలు ఉండాలి

### బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ కుమార్

**నేరేడుచర్ల( జనంసాక్షి):**
భారతదేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లో ఉందని, వారి చేతుల్లో పుస్తకాలు ఉండాలి గాని పనిముట్లు కాదని బీఆర్ఎస్ హుజూర్నగర్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్ కుమార్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక ఇటుక బట్టిలో ఉన్న పిల్లలకు చదువు విలువ గురించి వివరించారు. ప్రతి చిన్నారికి విద్య, స్వేచ్ఛ, సురక్షిత బాల్యం అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ సతీష్ కుమార్, షేక్ నాగుల్ మీరా, అరె శ్రీకాంత్ ,పోలే అనిల్ కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# చండూరు హై స్కూల్‌కి అడ్మిషన్ల వెల్లువ

**చండూరు, జూన్ 12 (జనంసాక్షి)**
చండూరు ఉన్నత పాఠశాల లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం అవుతున్నందువల్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుండి మంచి స్పందన వస్తుంది. అధిక సంఖ్యలో అడ్మిషన్లు పెరుగుతున్నాయి. ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా చండూరు పరిసర గ్రామాలలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. కస్తాల,అంగడిపేట, గుండ్రపల్లి, ఉడతల పెల్లి,పొనుగోడు, తుమ్మలపెల్లి, శిరిదేపల్లి వంటి గ్రామాల నుంచి మంచి స్పందన వస్తుందని ప్రధానోపాధ్యాయులు ఏ. కోటీశ్వర్ రెడ్డి చెప్పారు. బడిబాట కార్యక్రమంలో చండూర్ హై స్కూల్ ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయమని, ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్చి ఉన్నతమైన విద్యను పొందవచ్చని పేర్కొన్నారు. బొమ్మరబోయిన చందు, వెంకటరెడ్డి, వీరేశం,పి. యాదయ్య, గంట వెంకటేశం, శ్రీను, యాదగిరి, రాపోలు యాదగిరి,రాజు, గిరి ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.





# ఫ్రీజింగ్ ఎత్తివేసి తక్షణమే

# దళిత బంధు నిధులు విడుదల చేయాలి

### డా. బుషిపాక గణేష్

**మోత్కూరు జూన్ 12 (జనంసాక్షి)**
దళిత బంధు పథకం కింద ఫ్రీజింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డా. బుషిపాక గణేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కశాఖర్ రాష్ట్ర సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కు డా. బుషిపాక గణేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డా. బుషిపాక గణేష్ మాట్లాడుతూ, 2023లో గత ప్రభుత్వం రెండో విడత దళిత బంధు పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.3 లక్షల చొప్పున జమ చేసిందన్నారు. అయితే కొద్ది రోజులకే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో జిల్లా కలెక్టర్లు ఆ ఖాతాలను ఫ్రీజ్ చేశారని తెలిపారు. తదనంతరం 28-01-2025న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండీ నిధులు విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని జిల్లాల్లో మాత్రమే ఆ ఉత్తర్వులు అమలయ్యాయని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ మరియు తుంగతుర్తి ఎమ్మెల్యే రెండున్నర సంవత్సరాలుగా ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి, జూన్ నెలాఖరులోగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రి ని కలిసిన వారిలో ఈ. నాగరాజు, ఇరుగు లక్ష్మణ్, వంగాల పవన్, పోలేపాక సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య? ప్రైవేటు విద్య?" ఏది మంచిది.!!?

ఈ రోజున పనికిరాని చదువైపోయిందా? లేదా మేధావులను తయారు చేయలేని స్థితికి చేరిందా? అయితే అసలు తప్పు ఎక్కడ జరిగింది? ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు మేధావులను తయారు చేశాయి. ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలలు భయాన్ని అమ్ముతున్నాయి. దేశ భవిష్యత్తు పాఠశాల బిల్డింగుల్లో కాదు, చదువుపై మన నమ్మకంలో ఉంది. నా పిల్లాడిని మంచి మనిషిగా, ఆలోచించే వ్యక్తిగా తయారు చేస్తుందా? ర్యాంకుల కోసం బట్టి పడుతోందా? ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల చదువు దేశాన్ని నిర్మించింది. ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలలు భయాన్ని అమ్ముకుంటున్నాయి. చదువు కాదు మారింది తల్లిదండ్రుల మనస్తత్వం మారింది. సమాజపు భయం, అపోహలు, ఆడంబర ఆలోచనలు. నేటి తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుపోయింది. "ప్రభుత్వ పాఠశాల అంటే పేదలది, ప్రైవేట్ పాఠశాల అంటే ఖరీదైనది."ఇది చదువు మీద నమ్మకం కాదు సమాజం ఏమనుకుంటుందో అన్న భయం. ప్రవేట్ పాఠశాల వైపు నడిపిస్తోంది. ఆంగ్లం భాషా భయం? విద్యను వ్యాపారంగా మార్చిందిఇంగ్లిష్ రాకపోతే ఉద్యోగం రాదన్న భయం ప్రైవేట్ పాఠశాలలకు బలంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమం ఉన్నా, దాన్ని సమర్థంగా అమలు చేయడంలో వ్యవస్థ తడబడింది. ఈ లోపాన్ని అవకాశంగా మార్చుకున్న ప్రైవేట్ పాఠశాలలు ఆంగ్లం పేరుతో ఫీజుల వ్యాపారాన్ని పెంచుకున్నాయి. కానీ తెలుగు వారు ఆంగ్ల మాధ్యమం పై వ్యామోహం పెంచుకొని తెలుగు హిందీ భాషలపై పట్టును కోల్పోయారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాష లో చదువుకున్న వారు ఇతర భాషలు నేర్చుకున్నారు మాట్లాడారు మరి ఇప్పుడు ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించి ఇతర భాషను చదవలేక పోతున్నారు రాయలేక పోతున్నారు. అప్పటికి ఇప్పటికీ ఏం మారిందో తల్లిదండ్రులు ఆలోచించాలి..

### ప్రైవేట్ పాఠశాలలకు ఎందుకు వెళ్తున్నారు?

భాషా భయం నేటి ప్రపంచంలోఉద్యోగం పోటీ పరీక్షలుఇంటర్వ్యూలు అన్నీ ఆంగ్లంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లంపై తల్లిదండ్రులకు నమ్మకం తగ్గింది "నా పిల్లాడు వెనుక పడిపోతాడేమో" అనే భయం. పోటీ భయం ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కువ పోటీ తక్కువ ఇప్పుడు ఉద్యోగాలు తక్కువ పోటీ ఎక్కువ తల్లిదండ్రుల ఆలోచన "మా పిల్లాడు ముందే ట్రెయిన్ కావాలి" ప్రైవేట్ స్కూల్స్ అదనపు క్లాసులు పరీక్షల ఒత్తిడిమార్కులు, ర్యాంకులు ఇవన్నీ భద్రతలా అనిపిస్తున్నాయి. సమాజంలో ఒక అపోహ బలంగా ఉంది. ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం తగ్గడంకొన్ని చోట్ల టీచర్లు తక్కువబదిలీలు పర్యవేక్షణ లోపం ఇవి చూసి తల్లిదండ్రులు వ్యవస్థపై నమ్మకం కోల్పోయారు. ప్రైవేట్ పాఠశాలలపై మొగ్గు చూపుతున్నారు.

### స్వేచ్ఛ లేని విద్యకు బానిస:

పాఠశాలల ప్రారంభం అయ్యాయంటే పిల్లలు భయం మొదలైంది.. ఆడుతూ పాడుతూ పాఠశాలకు వెళ్లాల్సిన బాల్యం బరువెక్కుతుంది. పోటీ ఒత్తిడి? చిన్నారులపై భారంగా మారింది ఒకప్పుడు చదువు జీవితం కోసం ఉండేది. ఇప్పుడు చదువు జీవితం మీద భారంగా మారిం ది. చిన్నారుల్ని చిన్న వయసులోనే ర్యాంకులు, మార్కులు, పరీక్షల ఒత్తిడిలో నెట్టేస్తున్నారు. దీనిని "నాణ్యమైన విద్య"గా ముద్ర వేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా భవిష్యత్తు భయంతో పిల్లల బాల్యాన్ని తాకట్టు పెడుతున్నారు. ప్రభుత్వ వ్యవస్థలో లోపాలున్నాయా? ఉన్నాయి.

అవును, కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది, పర్యవేక్షణ లోపం ఉంది, వ్యవస్థాపక నిర్లక్ష్యం కూడా ఉంది. కానీ ఇది మొత్తం ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను తిరస్కరించడానికి కారణమా? ఒక వ్యవస్థను సరిదిద్దాల్సిన చోట దాన్ని వదిలేసి పారిపోవడమేనా పరిష్కారం?

మేధావి పాఠశాల వల్ల కాదు? సంకల్పం వల్ల తయారవుతాడు ప్రభుత్వ పాఠశాల చదివినవాడు మేధావి అవుతాడు. ప్రైవేట్ పాఠశాల చదివినవాడు కూడా మేధావి అవుతాడు. మేధావిని తయారు చేసేది గురువు అంకితభావం కుటుంబ మద్దతు విలువలతో కూడిన విద్య ఆలోచించే స్వేచ్ఛ కాని ఇవన్నీ ఫీజులతో కొలవలేం. ఇప్పుడు అవసరం ఏంటి? ప్రభుత్వ పాఠశాలలను తక్కువ చేసి మాట్లాడటం కాదు. ప్రైవేట్ పాఠశాలలను అంధంగా పొగడటం కాదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం. గురువులకు గౌరవం, స్వేచ్ఛ ఇవ్వడం. విద్యను వ్యాపారం కాకుండా మానవ అభివృద్ధిగా చూడడం.

# ప్రజా ఆస్తుల రక్షణే ధ్యేయం

మొత్తం విస్తీర్ణంలో 10% భూమిని (మొత్తం 5,042 గజాల స్థలాన్ని) ప్రజా ప్రయోజనాల కోసం మున్సిపాలిటీకి అప్పగించారు. అయితే, కాలక్రమేణా ఈ ప్రభుత్వ భూమిపై కన్నేసిన కొందరు స్థానిక వ్యక్తులు, ఇందులో కొంత భాగాన్ని అక్రమంగా ఆక్రమించారు. అంతటితో ఆగకుండా, మున్సిపాలిటీకి చెందిన ఈ ప్రభుత్వ ఆస్తిని తమ సొంత ఆస్తిగా చూపిస్తూ ఇతర వ్యక్తులకు అనధికారికంగా క్రయవిక్రయాలు (అమ్మకాలు) కూడా జరిపారు.

### రంగంలోకి దిగిన అధికారులు.. ఫెన్సింగ్ ఏర్పాటు

ఈ ఘోర కబ్జా ఉదంతం అధికారుల దృష్టికి రావడంతో చండూరు మున్సిపాలిటీ అధికారులు తక్షణమే స్పందించారు. సంబంధిత వెంచర్ రికార్డులు, లేఅవుట్ పత్రాలు మరియు ఇతర కీలక ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆక్రమణలు జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించడంతో, ప్రత్యేక బృందంగా ఏర్పడి క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో మళ్లీ ఇటువంటి అక్రమ ఆక్రమణలు లేదా అనధికారిక రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు జరగకుండా మున్సిపాలిటీ కఠిన చర్యలు చేపట్టింది. స్వాధీనం చేసుకున్న 5,042 గజాల స్థలం చుట్టూ ముళ్లపొదలు/ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, "ఇది చండూరు మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ ఆస్తి" అని స్పష్టంగా తెలియజేసేలా భారీ నేమ్ బోర్డులను ఏర్పాటు చేశారు.

### అధికారుల హెచ్చరిక: చట్టపరమైన చర్యలు తప్పవు!

మున్సిపాలిటీకి చెందిన ప్రజా ఆస్తులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత. ప్రభుత్వ భూములపై ఎవరైనా అనధికారికంగా ఆక్రమణలకు పాల్పడినా, తప్పుడు పత్రాలతో క్రయవిక్రయాలు నిర్వహించినా, మున్సిపాలిటీ హక్కులకు భంగం కలిగించాలని చూసినా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం" అని మున్సిపాలిటీ అధికారులు ఈ సందర్భంగా తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని ఈ చర్య ద్వారా అధికారులు స్పష్టమైన సంకేతాలు పంపారు.

# పారిశుధ్య కార్మికుల శ్రమ వల్లే ఆరోగ్యకరమైన సమాజం చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు

## పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ




చండూరు, జూన్ 12 (జనంసాక్షి)

చండూరు మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య సిబ్బంది సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. శుక్రవారం (12.06.2026) సాయంత్రం 4.30 గంటలకు చండూరు మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, బెల్లం మరియు కొబ్బరి నూనె పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. వారి నిరంతర శ్రమ వల్లే ప్రజలు ఈ రోజు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు మున్సిపాలిటీ అభివృద్ధిలో అంతర్భాగం. వారి సేవలను సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవించాలి. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపడుతూ, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తాం అని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ఎండ, వాన, చలి అని చూడకుండా ప్రతికూల పరిస్థితులలో కూడా ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని అభినందించారు. వారి ఆరోగ్యం, భద్రత మరియు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తమ ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఈ సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టినందుకు పారిశుధ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కి, కమిషనర్ కి, ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారుఈ పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు తో పాటు10వ వార్డు కౌన్సిలర్: కటకం రమేష్ కో-ఆప్షన్ సభ్యులు: కల్లెట్ల చంద్రకళమారయ్య, మొగుదాల సత్తమ్మవెంకన్న, షేక్ సలీమా షరీఫ్ వార్డ్ ఆఫీసర్స్: జి. శ్రీరాములు, ఎ. జగన్, బి. సాయిరాం ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్: యమ్. అరవింద్ రెడ్డి ఇతర సిబ్బంది: బిల్ కలెక్టర్స్, పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత.. సర్పంచ్ రాయల శేఖర్

కనగల్లు, జూన్ 12 (జనం సాక్షి)




పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ధర్వేశిపురం సర్పంచ్ రాయల శేఖర్ అన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని-ప్లాస్టిక్ ను నియంత్రించడమే లక్ష్యంగా ముందుకు వచ్చిన ధర్వేశిపురం గ్రామానికి చెందిన జినుకుంట్ల డబ్బా లింగయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు జనుకుంట్ల మల్లేష్, జినుకుంట్ల నాగరాజులు వారి సొంత ఖర్చులతో 100 స్టీల్ ప్లేట్లను స్థానిక సర్పంచ్ రాయల శేఖర్ చేతుల మీదుగా గ్రామపంచాయతీకి శుక్రవారంఅప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం వలన కలిగే లాభాలు కాలుష్యం ద్వారా వచ్చే నష్టాలపై ప్రజలలో అవగాహన తీసుకురావలసిన బాధ్యత యువతపై ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమ్మ గోని జానకమ్మ పాపయ్య, వార్డు సభ్యులు జై నరసింహ, సైదులు, నాగమణి, నవ్య, పంచాయతీ కార్యదర్శి పద్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకం భారంగా మారిందా..?

# ఉన్నట్లా.. లేనట్లా..?

రెండో విడతలో రెండు ఎకరాల వరకు మాత్రమే రైతు ఖాతాల్లో నిధులు జమ చేశారు. యాసంగి సీజన్‌లో మూడు విడతలుగా రైతు భరోసా సహాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అనుకున్నట్లుగానే మొదటి విడతను మార్చి 22న, రెండో విడతను ఏప్రిల్ 20న విడుదల చేసినప్పటికీ.. మూడో విడత పెట్టుబడి సాయంపై మాత్రం ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టతా రాలేదు. రెండో విడత నిధులు అంది దాదాపు 50 రోజులు గడిచిపోతున్నా, మూడో విడత ఊసే లేకపోవడంతో మునుగోడు, చండూరు, మర్రిగూడ, నాంపల్లి, సంస్థాన్ నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల పరిధిలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అసలు మూడో విడత రైతు భరోసా ఉందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు రూ. 100 కోట్లకు పైగా రైతు భరోసా సాయం పెండింగ్‌లోనే ఉండిపోయింది.

### వడ్డీ వ్యాపారుల చెంతకు రైతులు..

ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగు పెట్టుబడుల కోసం మళ్లీ వడ్డీ వ్యాపారుల వైపు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అనేక ఇబ్బందులు పడి, ఎట్టకేలకు పంటను అమ్ముకున్న రైతులకు.. సకాలంలో చేతికి డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మార్కెట్లో రసాయన ఎరువులు, విత్తనాల ధరల పెంపు రైతులకు మరింత భారంగా మారింది. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక, ప్రభుత్వం ఇవ్వాల్సిన మూడో విడత సాయం రాకపోవడంతో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా రైతాంగం తీవ్ర నిరాశ నిస్పృహల్లో మునిగిపోయింది. ప్రభుత్వం ఇప్పటికైనా కాలయాపన స్వస్తి పలికి, మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 100 కోట్ల భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వానాకాలం సాగు ఊపందుకోకముందే ఈ పెట్టుబడి సాయాన్ని అందించి, అన్నదాతను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాలని క్షేత్రస్థాయి రైతాంగం ముక్తకంఠంతో కోరుతోంది.



# ప్రైవేట్ పాఠశాలల అక్రమ ఫీజుల దందాపై చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్‌కు బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిర్యాల శ్రీనివాస్ డిమాండ్**



**భువనగిరి, జూన్ 12 (జనం సాక్షి)** కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నాయని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిర్యాల శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బ్యాగులు తదితర విద్యా సామగ్రిని మార్కెట్ ధరలకు మించి అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నారని విమర్శించారు. అదేవిధంగా ప్రతి ఏడాది ఎలాంటి సమంజసమైన కారణాలు లేకుండానే ఫీజులను పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేక పోయినా సంబంధిత అధికారులు తగిన తనిఖీలు నిర్వహించడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ప్రతి విద్యార్థికి నాణ్యమైన, అందుబాటులో ఉండే విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమ ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ, ఎంఈఓలకు గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై స్పందన లేకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుజ్జ పవన్, బానోతు శ్రవణ్ నాయక్, దాసరి చరణ్, బానోతు ఆకాష్ నాయక్, గణేష్, మల్లేష్, నాని తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల

# దోపిడీపై ఉక్కుపాదం

**విద్యాశాఖ ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు**

**చండూరు, జూన్ 12 (జనంసాక్షి)** రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న అధిక ఫీజులకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్న ఫీజుల దోపిడీపై తక్షణమే చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని అందుబాటులోకి తెచ్చింది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో, నిబంధనలను ఉల్లంఘించి అధిక ఫీజులు డిమాండ్ చేసే ప్రైవేట్ విద్యాసంస్థలపై తల్లిదండ్రులు ఇకపై నేరుగా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చుబాధిత తల్లిదండ్రులు తమ ఫిర్యాదులను నమోదు చేయడానికి విద్యాశాఖ కింది నంబర్లను కేటాయించింది. టోల్ ఫ్రీ నంబర్: 1800-425-7462 ల్యాండ్‌లైన్ నంబర్: 040-23232343. ఫోన్ కాల్స్ మాత్రమే కాకుండా, తల్లిదండ్రులు తమ ఫిర్యాదులను ఆధారాలతో సహా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో సులభంగా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ ఫిర్యాదుల నమోదు ప్రక్రియ తక్షణమే అమలులోకి వచ్చింది.

**అధికారుల హెచ్చరిక:**

తల్లిదండ్రుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తూచా తప్పకుండా విచారణ జరుపుతాం. ప్రభుత్వ నిబంధనలను మీరి, అక్రమంగా ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సదరు పాఠశాలల గుర్తింపును కూడా రద్దు చేయడానికి వెనుకాడబోం అని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

# సామాజిక స్పృహతో కూడిన కవిత్వం రావాలి

**తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి**



**తుంగతుర్తి జూన్ 12 (జనంసాక్షి)** కవులు సామాజిక స్పృహతో కవిత్వం రాయాలని, వస్తువులో నవ్యత సాహిత్యాన్ని శాశ్వతం చేస్తుందని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. తుంగతుర్తి కి చెందిన డాక్టర్ ఎర్ర హరికిషన్ రచించిన చిత్రం చెప్పిన పద్యం - 2 గ్రంథాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎర్రన పేరుతో కవిత్వం రాస్తున్న ఎర్ర హరికిషన్ ఈ వస్తువులు తీసుకున్నా దానిని కవిత్వం చేయగలిగే చందో సామర్థ్యం ఉన్నా కవి అని కొనియాడారు. భవిష్యత్తులో ఈరోజు సాహిత్య చరిత్రలో నిలిచిపోయే పద్య కావ్యం రాయాలని ఆకాంక్షించారు. మనం వికాస వేదిక అధ్యక్షులు ప్రముఖ సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కళాశాల ఆచార్యులు బోయిళ్ళ వీరయ్య మాట్లాడుతూ హరికిషన్ చిన్ననాటి నుండే సాహిత్యం పట్ల ఎంతో మంది కనబరిచే వారని అన్నారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ తుంగతుర్తి గ్రామీణ ప్రాంతం నుంచి పద్యము అలవోకగా రాయగలిగిన గొప్ప కవిగా హరికిషన్ సాహిత్య చరిత్రలో నిలిచిపోతారు అన్నారు. ప్రముఖ సాహితీవేత్త దోరవేటి మాట్లాడుతూ పురాణాలు ఇతిహాసాలు సంస్కృతి, సంస్కృతి, సామాజిక స్పృహ, ప్రముఖుల పై ప్రశంస పద్యాలు మొదలైన వస్తు వైవిధ్యంతో కూడిన ఈ ఖండకావ్యం ధారా శుద్ధితో కూడి ఉన్నదన్నారు. కార్యక్రమంలో గద్దం కృష్ణారెడ్డి పుస్తక సమీక్ష నిర్వహించారు. పుస్తకాన్ని డాక్టర్ సాగర్ల సత్తయ్యకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరీశాల వెంకటేశ్వర్లు, శీల అవిలేను, పబ్బతి వెంకటేశ్వర్లు, ఏబెల్ శశి, రంగరాజు, డాక్టర్ మెంతబోయిన సైదులు, అంబేద్కర్, హరీష్ అగ్నిహోత్ర తదితరులు పాల్గొన్నారు.



## పోచంపల్లిలో మెగా జాబ్ మేళా..

**ఫాక్స్‌కాన్ కంపెనీలో 500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు**

**భూదాన్ పోచంపల్లి, జూన్ 12(జనం సాక్షి ):** స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, పోచంపల్లి మాజీ సర్పంచ్ బండి కృష్ణ సౌజన్యంతో మండలంలో 'మెగా జాబ్ మేళా'ను నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని ధరణి డైరీ ఆవరణలో జరిగిన ఈ ఇంటర్వ్యూలను ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ?రంగారెడ్డి జిల్లా, కొంగర కలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఖాళీగా ఉన్న 500 ఉద్యోగాల భర్తీ కోసం ఈ మేళాను ఏర్పాటు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మండలంలోని పలువురు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు మాజీ సర్పంచ్ బండి కృష్ణ తీసుకున్న చొరవను పలువురు అభినందించారు.



## చిన్నారుల విద్యకు బలమైన పునాది వేయడమే లక్ష్యం



**సూర్యాపేట(జనంసాక్షి):** చిన్నారుల విద్యకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఆల్ఫాబెట్స్ స్కూల్ ను ప్రారంభించినట్లు ఆ స్కూల్ ఇంచార్జ్ బి.రమణ తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీరామ్ నగర్ లో విమానం ట్యాంక్ బజార్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆల్ఫాబెట్స్ స్కూల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లే గ్రూప్ నుంచి యూకేజీ వరకు చిన్నారులకు విలువలు, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా బోధన అందించనున్నట్లు తెలిపారు. చిన్నారుల మానసిక, శారీరక, మేధో వికాసానికి అనుకూలమైన వాతావరణాన్ని పాఠశాలలో కల్పించినట్లు పేర్కొన్నారు. ఆధునిక విద్యా విధానాలతో పాటు ఆటల ద్వారా నేర్చుకునే అవకాశాలను అందిస్తూ పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యను అందించే విద్యాసంస్థలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్లే గ్రూప్ నుంచి యూకేజీ వరకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, ఆసక్తి గల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



## లక్కీ డ్రా ద్వారా బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల ఎంపిక

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** షెడ్యూల్ కులముల విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరంకు బెస్ట్ అవైలబుల్ పథకం కింద వివిధ పాఠశాలల్లో 1వ తరగతి డే స్కాలర్, 5వ తరగతి రెసిడెన్షియల్ లో ప్రవేశాల కొరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.హరిసింగ్ అధ్యక్షత వహించారు. 1వ తరగతిలో 89 మంది విద్యార్థులను, 5వ తరగతిలో 82 మంది విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె.దయానంద రాణి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ సిహెచ్.పద్మ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గుర్రంపోడులో ఘనంగా బిఆర్ఎస్ నేత మునుకుంట్ల రాజేష్ రెడ్డి జన్మదినవేడుకలు

### ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి

**గుర్రంపోడు, జూన్ 12( జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని గుర్రంపోడు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కీలక నాయకుడు, ప్రైవేటు ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునుకుంట్ల రాజేష్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి.మండల కేంద్రంలోని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయ ఆవరణలో ఈ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) యం.సి కోటిరెడ్డి గారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో క్యాంప్ కార్యాలయం పండుగ వాతావరణాన్నితలపించింది.ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ కోటిరెడ్డి సమక్షంలో రాజేష్ రెడ్డి బర్త్డే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాజేష్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీలు పోలే రామచంద్రం, చామల బొజ్జయ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారితో పాటు పార్టీ ముఖ్య నాయకులు సైదిరెడ్డి, వేముల యాదయ్య, మేక రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ జాల మల్లేష్ యాదవ్, కురుమారెడ్డి, కుంటి గొర్ల లింగయ్య యాదవ్, పురుషోత్తం యాదవ్, శంకర్ యాదవ్, అందుగుల శ్రీను, షేక్ సిరాజ్, వెంకటాచారి, కృష్ణ గౌడ్, ఓంకారం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు రాజేష్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎల్ నినో ప్రభావం పై అవగాహన



**కల్లూరు జూన్ 12 (జనంసాక్షి)**
కల్లూరు మండలంలోని ముగ్గువెంకటాపురం గ్రామం టెయిల్ ఎండ్ ప్రాంతంలో రైతులతో శుక్రవారం జరిగిన సమావేశంలో మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ మాదాబత్తుల రూప ఎల్ నీనో ప్రభావంపై అవగాహన కల్పించారు. ఎల్నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య , తూర్పు ప్రాంతరాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలలు సాధారణం కంటే ఎక్కువగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి అని వివరించారు. ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం , ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపుతుంది.

**వ్యవసాయంపై ఎలినినో ప్రభావం**
సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది.కరువు పరిస్థితులు ఏర్పడవచ్చు. పంటల పెరుగుదల దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉంటుంది.అధిక ఉష్ణోగ్రతల వల్ల పంటలకు వత్తిడి పెరుగుతుంది అని తెలిపారు.

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**
తక్కువ నీటితో పెరిగే పంటలను ఎంపిక చేసుకోవాలి.. వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి.. మల్చింగ్ , సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి. వాతావరణ శాఖ సూచనలను అనుసరించి వ్యవసాయ పనులు నిర్వహించాలి.సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు (డ్రిప్ , స్ప్రింక్లర్) ఉపయోగించాలిఅని సూచించారు.ఎల్ నినో పరిస్థితుల సమయంలో ముందస్తు ప్రణాళికతో నీటి వనరులను సమర్థవంతంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకొవచ్చు అన్నారు.వరి అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలు నానో ఎరువుల వినియోగం ఎరువుల సమర్థవంతమైన మితమైన వినియోగం నకిలీ విత్తనాల గుర్తింపు , నివారణ హరిత ఎరువుల పంటలు,విత్తనాల ప్రయోజనాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంఏఓ కల్లూరు, ఏఈఈ ఇరిగేషన్ గణేష్, ఏఈఓ కొర్లగూడెం, ముగ్గువెంకటాపురం సర్పంచ్ వడ్లమూడి బేబీ స్వరాజ్యం పలువురు రైతులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత- కంబపు సూరి రెడ్డి

### బాల కార్మికులను పనిలో పెడితే కఠిన చర్యలు..



**మణుగూరు, జూన్ 12 (జనంసాక్షి):**
ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మణుగూరు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు మండలం తోగూడెం గ్రామంలోని ఇటుకల తయారీ పరిశ్రమలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థ సమాజానికి ఒక శాపంగా మారిందని, దీనిని పూర్తిగా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పద్నాలుగు సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన పనిలోనైనా నియమించడం చట్ట విరుద్ధమని, అలాంటి సంఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు లేదా పిల్లల సహాయ సేవలకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి చిన్నారికి విద్య హక్కు ఉందని, ఆ హక్కును కాపాడడం తల్లిదండ్రులు, యజమానులు, సమాజం అందరి బాధ్యత అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల కార్మికులను పనుల నుంచి బయటకు తీసుకువచ్చి తిరిగి విద్యలోకి తీసుకురావడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, ప్రత్యేక శిక్షణ, ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం, పునరావాసం వంటి కార్యక్రమాలు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. అనాథలు, నిరాశ్రయులు, ప్రమాదంలో ఉన్న పిల్లలకు ఆశ్రయం, విద్య, సలహా సేవలు, పునరావాస కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ఆరోగ్య సేవలు, చిన్నారుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టిన యజమానులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. పిల్లలను పనిలో పెట్టకుండా విద్యాభ్యాసం వైపు నడిపించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అధ్యక్షులు గురు కృష్ణ, మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాది వాసవి, ఎం ఎల్ ఎస్సి కోఆర్డినేటర్ రవీందర్ లు ప్రజలకు బాల కార్మిక వ్యవస్థ దుష్పరిణామాలు, పిల్లల విద్య హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కార్మికులు, గ్రామస్థులు, న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతాంగ ఉద్యమాలను బలోపేతం చేయాలి : ఏఐకెఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి డేవిడ్ కుమార్




**నూతనకల్ జూన్12(జనంసాక్షి)**
భూమి పై ఆధారపడి ఈ దేశ ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేస్తున్న రైతాంగం ను వ్యవసాయానికి దూరం చేసి కార్పొరేట్ లకు భూములను అప్పనంగా అప్పగించనున్నారు దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున రైతాంగం ఉద్యమాలను బలోపేతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ( ఏ ఐ కె ఎం ఎస్) రాష్ట్ర కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ శుక్రవారం పిలుపునిచ్చారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ ఐ కె ఎం ఎస్) సూర్యాపేట డివిజన్ 2 వ మహాసభ నూతనకల్ లో సాయిరాం ఫంక్షన్ హాల్ లో ముప్పని సుదర్శన్,కోట మధుసూదన్ అధ్యక్షతన సభ నిర్వహించారు ఏ ఐ కె ఎం ఎస్ సీనియర్ నేత కామ్రేడ్ ఎస్ కే.మైబెల్లి జెండాను ఎగురవేశారు రైతు కూలీ అమర వీరుల ను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ఎం. డేవిడ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక చర్యలతో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడిందన్నారు రైతు భరోసా, రుణమాఫీ ఎగనామం పెట్టారు సకాలంలో పంటను కొనుగోలు చేయకపోవడంతో అనేకమంది రైతులు వడదెబ్బతో మృతి చెందారని అప్పుల్లో కూరకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు దేశంలో 40 శాతం మందికి పైగా సెంటు భూమి కూడా లేదని వారికి ఉపాధి లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యాంత్రికరణ పేరుతో ఉపాధి అవకాశాలు తగ్గాయని నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు ఉపాధి హామీ పథకానికి విబిజి రాంజీ పేరు మార్చి క్రమంగా దానిని ఎత్తివేయాలని ఆలోచించటం ప్రజలకు ఉపాధిని దూరం చేయడమేనని విమర్శించారు తొలకరి సమయంలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అరికట్టాలని రైతాంగానికి ఉచితంగా వాటన్నిటిని అందించాలని కోరారు వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టే చర్యలను తక్షణమే చేపట్టాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు నల్గొండ నాగయ్య, పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ, తమ సందేశాలు ఇచ్చారు దీనిలో దాసరి శ్రీనివాస్, జిలేరు, సంజీవరెడ్డి, వెంకట్ రెడ్డి, దశరథ , దగ్గుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



అడ్డగూడూర్ /జూన్ 12(జనం సాక్షి )
అడ్డగుడూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు మరియు ఇతర సిబ్బంది ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ డిప్యూటీ కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదని, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలపైనే ఆధారపడుతున్నందున ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి వైద్య సేవలను మెరుగుపరచాలని కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య హక్కును కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్,సీపీఎం మండల కమిటీ సభ్యులు వళ్ళంబట్ల శ్రీనివాసరావు, విద్యార్థి జనసామితి జిల్లా అధ్యక్షులు డప్పు గోపి,బీఆర్ స్ మండల నాయకులు చిప్పలపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ సిబ్బందికి గుండె వైద్య పరీక్షలు: పోలీస్ కమిషనర్

**ఖమ్మం కార్పొరేషన్ జూన్ 12 (జనంసాక్షి)**

పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్యానికి పోలీస్ శాఖ ప్రాధాన్యమిస్తోందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఖమ్మం ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఈసీజీ, టూడీ ఈకో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిభిరాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారని, కుటుంబంలో ప్రశాంత ఉంటుందన్నారు. స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధినిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు, ప్రాణాంతక సమస్యలను ముందుగానే గుర్తించి నివారించడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమైన గుండె వైద్య పరీక్షలు ఈసీజీ,టూడీ ఈకో పరీక్షలను యశోద వంటి ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, సిబ్బందికి ఈ ఆరోగ్య ప్రొఫైల్స్‌ను అందిస్తున్నాయట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యశోద హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు భరత్ రెడ్డి, సీనియర్ మేనేజర్ వినయ్ కుమార్, ఎస్బి ఏసీపీ మహేష్, ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్ సాంబశివరావు పాల్గొన్నారు.

## కల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా సాయి కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ

**కల్లూరు జూన్ 12(జనంసాక్షి)**

కల్లూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా గుర్రం సాయి కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు గ్రామానికి చెందిన సాయి కృష్ణా రెడ్డి గతంలో భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తూ2025లో గ్రూప్-2కు ఎంపికయ్యారు. సి డి ఎం ఏ లో శిక్షణ పూర్తి చేసుకుని తొలి పోస్టింగ్ కల్లూరు మున్సిపల్ కమిషనర్ గా నియమితులయ్యారు. కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ను కల్లూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా నియమితు లైన సాయి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కల్లూరు మున్సిపాలిటీ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపాలిటీ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సాయి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి, పాలకవర్గం సిబ్బంది అధికారులు అంతా సమిష్టిగా సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, ఎండి ఇస్మాయిల్, గుండ్ల పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు శీలం కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, కార్యాలయం మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరరావు డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.








10 మంగళవారం 02 జూన్ 2026 ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం - నల్లగొండ - సూర్యాపేట యాద్రాద్రి

పాడైపోయిన రాతోని చెరువు కాలువ తూముల షట్టర్లు

•సంవత్సరాలు గడిచినాపట్టించుకోని అధికారులు

•వృధాగా పోతున్న సాగునీరు



# జనంసాక్షి "వార్తకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు

- పాడైపోయిన తూముల షట్టర్లను పరిశీలించిన.ఐబి జెఈ
- పూర్తిగా పాడైపోయిన ఎనిమిది షట్టర్లు
- కొత్త షట్టర్ల ఏర్పాటుకు ఎస్టిమేషన్

**పెనుబల్లి, జూన్ 12 (జనంసాక్షి)**

పెనుబల్లి మండలం పెనుబల్లి రాథోని చెరువు కాలువల తూముల షట్టర్ల పై "జనం సాక్షి" పత్రికలో "పాడైపోయిన రాతోని చెరువు కాలువ తూముల షట్టర్లు" అనే హెడ్డింగ్ తో వచ్చిన వార్తకు స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు. ఐబీ డీఈ సిహెచ్ రామారావు ఆదేశాల మేరకు శుక్రవారం చెరువు 1వ, 2వ కాలువల తూములను, పాడైపోయిన షట్టర్లను పరిశీలించిన ఐబి జేఈ ఎం. శ్రీనివాస్. సుమారు రెండువేల ఎకరాల ఆయకట్టు ఉన్న పెనుబల్లి రాథోని చెరువు రెండు కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందుతుంది. గత కొన్ని ఏళ్లుగా ఈ రెండు కాలువల తూముల షట్టర్లు తుప్పు పట్టి పూర్తిగా పాడైపోయాయి. షట్టర్లు పాడైపోవడంతో వర్షాకాలం, వేసంగి వరి పంటలకు కాలువల ద్వారా విడుదలైన సాగునీరు నియంత్రణకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. చెరువు చివరి భూములకు సాగునీరు అందటం చాలా కష్టంగా మారింది. అంతేకాకుండా మొదటి తూముల ద్వారా పంట పొలాలపై సాగునీరు వృధాగా పోయి రాతోని చెరువులో నీటి నిల్వలకు అంతరాయం ఏర్పడింది. వేసవికాలంలో చెరువులో కనీసం పశువుల త్రాగునీటి నిలువలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. రాథోని చెరువు నీటి నిలువలకు ప్రధాన సమస్యగా మారిన తుప్పు పట్టి పాడైపోయిన తూముల షట్టర్లపై "జనం సాక్షి" పత్రికలో వచ్చిన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి కాలువలు,వాటికున్న తూములను పరిశీలించారు.నూతన షట్టర్ల ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేసి నిధుల మంజూరు కి ఉన్నతాధికారులకు ఎస్టిమేషన్ కాపీలను పంపించినట్లు డి ఈ సిహెచ్ రామారావు తెలిపారు.

## నగర టైలర్స్ అసోసియేషన్ కి నూతన కమిటీ ఎన్నిక..

**అధ్యక్ష కార్యదర్శిగా పులి ప్రభాకర్ పుట్టారవి..**




**ఖమ్మం కార్పొరేషన్ జూన్ 12 (జనంసాక్షి)**

ఖమ్మం నగరంలో నగర టైలర్స్ అసోసియేషన్ కి అట్టహాసంగా బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించగా టైలర్స్ స్ట్రీట్ ఎన్నికల నిర్వహ కమిటీ పెద్దలు ఎక్సపో టైలర్ పాపారావు, టిప్ టాప్ టైలర్ శ్రీను, టైలర్ నర్సింహా రావు , సమక్షంలో నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పులి ప్రభాకర్, పుట్టారవి నీ ఎన్నుకున్నారు.అనంతరం ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు కమిటీ సభ్యులు అంతా కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువులతో అభినందించారు.. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ..టైలర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అధ్యక్షుడు పులి ప్రభాకర్ తో పుట్టారవి కలిసి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జానకి రామయ్య, బోసు,వనం శ్రీను, తదితరులు పాల్గొన్నారు..

**హాలియాలో టీ స్టాల్ లో కార్యకర్తల తో నోముల భగత్ సందడి**

హాలియా పట్టణం, సాగర్ రోడ్డు నందు హైదరాబాది అమృతుల్య టీ స్టాల్ నందు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి "టీ" తాగిన నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ గారు.. **హాలియా, జనంసాక్షి**



## నూతన షట్టర్లు ఏర్పాటు చేయాలి

**ఐ బి అధికారులకు రైతులు వినతి పత్రం**

**పెనుబల్లి, జూన్ 12(జనం సాక్షి )**



పెనుబల్లిమండలం రాథోని చెరువు కాలువల తూములు షటర్లు పాడైపోయినందున కొత్త షట్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం రాతోని ఆయకట్టు రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో చిలుకు బత్తుల చెన్నారావు,జిల్లెల్ల నరసింహ స్వామి,పొన్నగంటి వాణి పతి రావు,అన్నపురెడ్డి లక్ష్మయ్య,బొర్రా రవి,బుర్రా సూరిబాబు తదితర ఆయకట్టు రైతులు ఉన్నారు.

## చంద్రుగొండ గ్రామపంచాయతీ వద్ద యువకుల నిరసన

## కొత్త సెక్రెటరీని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

**చంద్రుగొండ, జూన్ 12( జనంసాక్షి):**

చంద్రుగొండ గ్రామపంచాయతీ వద్ద యువకులు నిరసన చేపట్టారు. శుక్రవారం గ్రామపంచాయతీ వద్ద యువకులు పాత సెక్రటరీని మరలా పోస్టింగ్ వచ్చేలాగా పంచాయతీ పాలకవర్గం ముఖ్యంగా సర్పంచ్ ప్రయత్నించడాన్ని నిరసిస్తూ కొత్త సెక్రెటరీని విధుల్లోకి తీసుకోవాలని ఆయనకు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు దృష్టిసారించి కొత్త సెక్రటరీ ని విధుల్లోకి తీసుకోవాలన్నారు. వేరే పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.



# పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి చాటేలా..

## కళాకారులతో సమావేశం

**భూదాన్ పోచంపల్లి, జూన్ 12:**

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ సౌజన్యంతో, టూరిస్ట్ అండ్ ఎకనామిక్ డెవలప్మెంట్ కన్సల్టెంట్ల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలోని టూరిజం భవనంలో చేనేత కళాకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం పోచంపల్లికి వివిధ దేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇక్కడి చేనేత సంప్రదాయం, కళాకారుల జీవన విధానం, పోచంపల్లి చేనేత ప్రత్యేకతలను ప్రత్యక్షంగా పరిచయం చేయడం. ఇందులో భాగంగా విదేశీ పర్యాటకులు చేనేత కళాకారుల ఇళ్లలో బస చేస్తూ వారి జీవన స్థితిగతులు, నైపుణ్యాలను తెలుసుకునే విధంగా అవగాహన కల్పించారు. పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా చేనేత సహాయ సంచాలకులు శ్రీనివాస్, టూరిస్ట్ అండ్ ఎకనామిక్ క్రియేటివ్ డెవలప్మెంట్ కన్సల్టెంట్ సాహితి, శ్రీనివాస్, డాక్టర్ జల్వంతి నాయుడు పాల్గొని పర్యాటక అభివృద్ధిలో చేనేత రంగం పాత్రపై వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక



సంఘం నాయకులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.

# మాదిగ మాదిగ ఉపకులాల విద్యార్థినీ విద్యార్థులు విద్యలో ఉద్యోగాలలో ముందుండాలి

## బిర్రు మహేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇంచార్జ్

**అడ్డగూడూర్ జూన్ 12(జనంసాక్షి):**

మాదిగ మాదిగ ఉపకులాల విద్యార్థినీ విద్యార్థులు విద్యలో ముందుండాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ. పిలుపునిచ్చినారు యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డ గూడూరు మండలం రేపాక డి గ్రామంలో ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందుకోవడంలో మాదిగ విద్యార్థిని విద్యార్థులు విద్యలో ముందుండాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షులు సూరారం రాజు మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విద్య ఉద్యోగ ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ జండా గద్దెల నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్పిఎస్ ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ మాదిగ మాదిగ ఉపకులాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను విద్యలో ముందుండే విధంగా చర్యలు చేపట్టాలని అందుకు అనుగుణంగా ఎంతటి అడ్డంకులు ఎదురైనా సరే అధిగమించి పిల్లలను మాత్రం ఒక్కరోజు కూడా ఇంటికాడ ఉండకుండా బడిబాట పట్టే విధంగా వారి ప్రయత్నాలు కొనసాగాలని లేని ఎడల రాష్ట్రంలో దేశంలో మూడు దశాబ్దాలుగా పైబడి ఎస్సీ జాబితాలోని 59 కులాలకు సామాజిక న్యాయాన్ని సాధించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చేసిన కృషి ఫలితం వ్యర్థమవుతుందని ఆయన తెలియజేసినారు అలా వ్యర్థం కాకుండా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ మాదిగ ఉపకులాల విద్యార్థిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలంటే అది కేవలం ఒక విద్యతోనే సాధ్యమవుతుందని అందుకు అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పట్టుదలతో పిల్లలను



సక్రమంగా బడికి పోయే విధంగా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చినారు జూలై ఏడవ తేదీన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించిన 32 వ సంవత్సరాల సందర్భంగా జిల్లాలోని ప్రతి మాదిగ పల్లెలో మాదిగ ఉపకులాల పల్లెలో దిమ్మలు లేని గ్రామాలను గుర్తించి ఎమ్మార్పీఎస్ జండా దిమ్మలను ఏర్పాటు చేసి ఒక పండగ వాతావరణంలో ఎంఆర్పిఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవాల సంబరాలను సంబరాలను చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చినారు కార్యక్రమానంతరం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ వేయడం జరిగింది ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా చిప్పలపల్లి మధుసూదన్ మాదిగ అధికార ప్రతినిధిగా సూరారపు బాబు కుమార్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా మచ్చ గిరి మాదిగ ఉపాధ్యక్షులుగా సూరారం మచ్చగిరి మాదిగ కార్యదర్శిగా చిప్పలపల్లి నవీన్ కుమార్ మాదిగ తదితరులను నూతన గ్రామ కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాలెంల నరేష్ మాదిగ చిప్పలపల్లి శ్రీనివాస్ పాపయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు చిప్పలపల్లి సైదులు మాదిగ సూరారం నవీన్ కుమార్ మాదిగ ముక్కెర్ల సైదులు మాదిగ సూరారం జాను మాదిగ గ్యార స్వామి మాదిగ గ్యార బిక్షం మాదిగ సూరారం మత్స్యగిరి మాదిగ తదితరులు విద్యార్థులు కుల పెద్దలు పాల్గొన్నారు.





# పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

## ఆర్టిఏ జిల్లా సభ్యులు రాజిరెడ్డి

**కనగల్లు, జూన్ 12 (జనం సాక్షి)**

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నఇందిరమ్మ గృహ పథకం నిరుపేదలకు ఓ వరం లాంటిదని ఆర్టిఏ జిల్లా సభ్యులు కే రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్లాం నగర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ గృహ పథకం కింద నిర్మాణం పూర్తి చేసుకున్న ఇంటి యజమాని ఆహ్వానం మేరకు రాజిరెడ్డి హాజరై కుటుంబ సభ్యుల తో కలిసిగృహప్రవేశం చేశారు. సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని మాది హామీల ప్రభుత్వం కాదని అమలు చేసి చూపించే ప్రభుత్వమని పేర్కొన్నారు. అరులైన ప్రతి ఒక్కరికి విడతలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరి ఇవ్వడం జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో గృహ లబ్ధిదారులు షేక్ లతీఫ్ జాబితా బేగం, చర్లగౌరారం సర్పంచ్ చిలక రాజు సునీత వెంకటేశం, మండల మైనార్టీ అధ్యక్షులు షేక్ షబ్బీర్, షేక్ సలీం, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి సైదులు, షేక్ రంజాన్, షేక్ ఉమర్, అమీన్, నజీర్, ఖాదర్, హుస్సేన్ ,ఆజాద్, తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల వేలం పాట ద్వారా ఎక్సైజ్ శాఖకు రెండు లక్షలకు పైగా ఆదాయం

**తుంగతుర్తి జూన్ 12 (జనం సాక్షి)**



వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాలకు తుంగతుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో ఎక్సైజ్ శాఖకు రెండు లక్షల ఐదువేల తొమ్మిది వందల పది రూపాయలు ఆదాయం వచ్చినట్లు తుంగతుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రజిత తెలిపారు, శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసులలో పట్టుబడిన 9 వాహనాలకు నిర్వహించిన వేలంపాటలో పాల్గొనే వారి నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు ఈ వేలం పాటలో 2,05,910 రూపాయల ఆదాయం వచ్చిందని ఇట్టి రూపాయలను ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు, ఇట్టి కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు డి, మూర్తి, జయప్రకాష్ తో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముక్తాపూర్‌లో ప్రయాణికుల ధర్నా

**పోచంపల్లి, జూన్ 12 (జనం సాక్షి):**



పోచంపల్లి నుండి హైదరాబాద్‌కు నడిచే ప్రైవేట్ అద్దె బస్సుల సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలపరిమితి ముగియడంతో బస్సులను నిలిపివేయడంతో నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులు రోడ్డున పడ్డారు. ?శుక్రవారం ముక్తాపూర్‌కు రావాల్సిన 'నైట్ అవుట్' బస్సు రాకపోవడంతో, ఆగ్రహించిన గ్రామస్తులు, విద్యార్థులు, ఉద్యోగులు కలిసి రహదారిపై ఆందోళన చేపట్టారు. వెంటనే అధికారులు స్పందించి బస్సు సేవలను పునరుద్ధరించాలని, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు.



# ప్రజా సంస్కృతి ఉత్సవాలు జయప్రదం చేయండి

## నాంపల్లి చంద్రమౌళి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు

**నాంపల్లి,జూన్ 12 (జనంసాక్షి)**

ప్రజానాట్యమండలి ప్రజా సంస్కృతి ఉత్సవాలలో భాగంగా కళాకారుల సర్వే గట్లమల్లేపల్లి, నాంపల్లి వృత్తి కళాకారులని మరియు జానపద కళాకారులని అడిగి పేర్లు నమోదు చేసుకోవడం జరిగింది ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ జూన్ 8 నుండి 20 వరకు ప్రజా సంస్కృత ఉత్సవాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు అంతరించిపోతున్న జానపద గ్రామీణ కలలను కాపాడుకోవడం కళాకారులను ప్రోత్సహిస్తూ ప్రతి గ్రామాన ప్రజా సంస్కృతి ఉత్సవాలు నిర్వహించడం కళాకారుల కర్తవ్యం గా ముందుకెళ్లాలని అదేవిధంగా వృత్తి కళాకారులకు జీవన ఉపాధి కల్పించుట కొరకు కళాకారులకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు ప్రజా సంస్కృతిక ఉత్సవాలలో జానపద కళాకారులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారుకళాకారుల పేర్లు నమోదు చేసుకుని ఆయా గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించాలని కళాకారులందరికి ఏ షరతులు లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని నల్లగొండ జిల్లా కేంద్రంలో మినీ రవీంద్ర భారతి నిర్మించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కళాకారులు గడ్డం గురుమూర్తి, కప్పెర లక్ష్మయ్య, ఎల్లేష్, సైదులు, యాదగిరి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లి వెంకట్ యాదవ్ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

**హాలియా జనంసాక్షి జూన్ 12,**

బీఆర్ఎస్ పార్టీ 8 వ వార్డ్ ఇంచార్జ్ పిల్లి వెంకట్ యాదవ్ గారు ఇటీవల ప్రమాదవ శాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడటం వలన వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, యోగక్షేమాలుఅడిగి తెలుసుకొన్న నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కర్ణ నర్సి రెడ్డి, మాజీ పట్టణం అధ్యక్షులు వడ్డే సతీష్ రెడ్డి, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నల్గొండ సుధాకర్, మాజీ మార్కెట్ డైరెక్టర్ సురబి రాంబాబు,బొమ్మి శెట్టి ఆంజనేయులు,కూరాకుల రవి,గడ్డం సోము, హాజరిగూడెం సర్పంచ్ కూన్ రెడ్డి భాస్కర్ రెడ్డి, మోసంగి సర్పంచ్ పిల్లి ఉమా అభినయ్ యాదవ్, నల్లమెట్టి భాస్కర్ యాదవ్,గుండెబోయినా నాగరాజు,మొహ్మద్ తౌసిఫ్, సీతారాల మహేష్, వీరాబోయినా ప్రవీణ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..





## మైనర్‌పై దారుణానికి కఠిన శిక్ష విధించాలి

### నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం డిమాండ్

**ఖమ్మం, (జనంసాక్షి) :**
మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్నం ఘటనలో నిందితుడిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు మరింత కఠినమైన చట్టాలు అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి దారుణాలకు పాల్పడే నిందితులకు వేగవంతమైన విచారణ నిర్వహించి, చట్టం ప్రకారం కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, నేరాల నివారణకు అవసరమైన చట్టపరమైన సంస్కరణలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో మహిళలపై నేరాలకు తావులేని పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానీ బేగం, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షకీలా బి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం, కామేపల్లి మండల ఇన్‌చార్జి షేక్ షరీఫ్, సీనియర్ నాయకుడు సైదులు, ప్రముఖ గాయకుడు మూస, ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ పరిధి, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ది భాష తదితర నాయకులు పాల్గొన్నారు.

## మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేళ్లచెరువుకు 'గ్రీన్ ఎన్విరో గోల్డ్ అవార్డు 2026



**మేళ్లచెరువు జనంసాక్షి**
మేళ్లచెరువు పర్యావరణ పరిరక్షణలో విశేష కృషికి గుర్తింపుగా స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేళ్లచెరువు సిమెంట్ వర్క్స్ – ఎఎ కు ప్రతిష్టాత్మక 2వ వార్షిక గ్రీన్ ఎన్విరో పర్యావరణ అవార్డు 2026 ? బంగారు పతకం లభించింది.అస్సాం రాష్ట్రం గువాహటిలో 12 జూన్ 2026న గ్రీన్‌ఎన్విరో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ వార్షిక గ్రీన్ ఎన్విరో పర్యావరణ అవార్డు సదస్సు 2026 కార్యక్రమంలో ఈ అవార్డును మహారాష్ట్ర ముఖ్యమంత్రి టాస్క్ ఫోర్స్ ఫర్ ఎన్విరాన్మెంట్ సస్టైనబిలిటీ చైర్మన్ పటేల్ మరియు 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా', పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ జాదవ్ పయంగ్ చేతుల మీదుగా యూనిట్ హెడ్ ఢ ప్రెసిడెంట్ (వర్క్స్) ఎన్. శ్రీనివాస రావు స్వీకరించారు.ఈ సందర్భంగా . శ్రీనివాస రావు మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ జాదవ్ పయంగ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం మాకు ఎంతో స్ఫూర్తిదాయకం. మై హోమ్ సిమెంట్ సుస్థిర అభివృద్ధికి, హరిత భవిష్యత్తుకు కట్టుబడి పనిచేస్తోంది. ఈ గుర్తింపు మా బాధ్యతను మరింత పెంచింది" అని అన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ,జున్ 12 (జనం సాక్షి)**



మండలం లో పులిగిల్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యం కారణంగా వేముల ఎల్లమ్మ చనిపోయారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ గ్రామ సర్పంచ్ వేముల అనూష మల్లేష్ 2,000 , మాజీ సర్పంచ్ జక్క వెంకట్ రెడ్డి 4,000, కోమటి రెడ్డి ఇంద్రారెడ్డి 4,000 , వేముల సుధాకర్ 5,000 , కంచి బిందు రాములు 50కేజీల బియ్యం,కోమటిరెడ్డి మహేశ్వర్ రెడ్డి 2,000, కొంతం తిరుమల రెడ్డి 1,000 రూపాయల ను గ్రామ సర్పంచ్ చేత అందించడం జరిగింది .ఈ కార్యక్రమానికి వార్డు సభ్యులు వేముల అనిత ఆనంద్ వేముల పుష్ప నరసింహ, పల్లెర్ల హరీష్ ,తిరుమల రెడ్డి, బుగ్గ మల్లయ్య, వేముల అశోక్ దావీదు,రాములు నరేష్, ప్రశాంత్ పల్లెర్ల స్వామి, కిషన్ , మహేష్, మల్లేష్, బొడ్డు అనిల్, దొడ్డి స్వామి,మంద విజయ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

### మైనర్ బాలిక ఘటనపై నిందితుడికి

## కఠిన శిక్ష వేయాలి

**టేకులపల్లి,జూన్ 12(జనంసాక్షి):**
ఖమ్మంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్నం ఘటనపై బిఆర్ఎస్ టేకులపల్లి మండల మాజీ అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ తీవ్రగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ సమాజం తలదించుకు నేలా 12 సంవత్సరాల అమాయక బాలికపై కామాంధుడు, డ్రైవర్ గౌస్ జరిపిన ఈ అమానుష దాడిని తీవ్రంగా ఖండించారు. ఖమ్మంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో బాలిక పై అత్యాచారానికి ఒడిగట్టి, అనంతరం నాలుగో అంత స్తు నుండి కిందకు తోసేసి హత్య చేయాలని చూసిన సదరు నిందితుడిని చట్టం ముందు నిలబెట్టి ఉరిశిక్ష పడేలా కఠిన భయాందోళనలు నెలకొనడం దురదృష్ట కరమని వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితు రాలి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నందున ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే, తీవ్రంగా నష్టపోయిన సదరు మైనర్ బాలిక కుటుంబా నికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని, బాధితు రాలి కుటుంబానికి రు.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిం చి, న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.





## కోటిరెడ్డి సేవలు మరువలేనివి

### ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం జూన్ 12 (జనంసాక్షి)**
భద్రాచలం పట్టణంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో శుక్రవారం డా. యం. వి. కోటిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించినారు. కార్యక్రమంలో ముఖ్యఅతిదిగా భద్రాచలం శాసన సభ్యులు డా. తెల్లం వెంకట్రావు పాల్గొని డా. యం. వి. కోటిరెడ్డి సేవలు మరువలేనివని అన్నారు. డా. యం.వి.కోటిరెడ్డి 30 సంవత్సరాలు ఏజన్సీ ప్రాంతంలో నిరుపేద ఆదివాసీ గిరిజనులకు అత్యుత్తమమైన వైద్య సేవలు అందించారని, వీరి వలన ఎంతో మంది ప్రాణాపాయ స్తితి నుండి కోలుకున్నారని అన్నారు. పినపాక, జానంపేట, చింతూరు, భద్రాచల ప్రాంతాల్లో వైద్యసేలందిస్తూ ఆయా ప్రాంతాల్లోని పేద ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్నారని తెలిపినారు. అలాగే భద్రాచలం ఏరియా ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేసినారని కొనియాడారు. చింతూరు ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేసిన ఘనత డా. యం. వి. కోటిరెడ్డి కే దక్కుతుందని వారన్నారు. అనంతరం అదనపు జిల్లా వైద్యశాఖ ఆరోగ్యశాఖ అధికారి డా. డి. సైదులు, యం.వి.కోటిరెడ్డి పేద ప్రజలకు ఆధునికమైన వైద్యసేవలు, ఎనస్తీసియా, జనరల్ సర్జరీ, కాన్పుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సేవలందించినారని గుర్తు చేశారు. తదుపరిడా. సెక్రటరీ– కరస్పాండెంట్ ఎస్ .ఎల్.కాంతారావు మాట్లాడుతూ యం. వి. కోటిరెడ్డి పదవీ విరమణ పొందిన తరువాత కూడా ఏజన్సీ ప్రాంత ప్రజలకు తన సేవలు క్రియాశీలకంగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ భద్రాచలం ఏరియా ఆసుపత్రి డా. వై. రాజశేఖర్ రెడ్డి, డా. బి. సుబ్బరాజు మారుతి నర్సింగ్ కళాశాల చైర్మన్, డా. ఎ. మోహన్రావు, డా. రమేష్ చంద్ర, డా జి.వి.వి. సుదర్శన్, డా. జయభారతి, డా. పి.రాజశేఖర్, ఎన్.ఎన్.వి. రామారావు, డా. బి. సీతారామరాజు, జి. రాజారెడ్డి, పి. రమేష్, ఎ.జగదీష్, చావా లక్ష్మీనారాయణ, జి.వెంకటాచారి, డా. రమేష్ చంద్ర, లయన్ సిద్ధారెడ్డి, డా. భాను ప్రసాద్, మారుతి కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామంలో అఖిలేశ్వర్ రెడ్డి గానామృతం

### ○ సంగీత వేడుకగా మారిన హాలియా



**హాలియా, జూన్ 12 జనంసాక్షి:**
హాలియా పట్టణంలోని టైం పాఠశాల ఆవరణలో డాక్టర్ నులక రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమం సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ గాయకుడు చెన్ను అఖిలేశ్వర్ రెడ్డి తన స్వగ్రామంలో ప్రత్యక్షంగా పాటలు ఆలపించడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సంగీత బృందం ప్రదర్శించిన గీతాలు, స్వర విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఉత్సాహభరితమైన సంగీతానికి యువత ఆనందోత్సాహాలతో నృత్యాలు చేస్తూ కార్యక్రమాన్ని సందడిగా మార్చారు. హాలియా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై సంగీత వేడుకను ఆస్వాదించారు.ఈ సందర్భంగా అఖిలేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తాను హాలియాలోనే పుట్టి పెరిగి విద్యాభ్యాసం పూర్తి చేశానని, స్వగ్రామంలో ప్రదర్శన ఇవ్వడం జీవితంలో మరపురాని అనుభూతిగా భావిస్తున్నానని తెలిపారు. ఈ నేల, ఇక్కడి ప్రజల ప్రేమ, ప్రకృతి అందాలు తన సంగీత ప్రయాణానికి ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు.పల్లెటూరి నుంచి ప్రారంభమైన తన ప్రయాణం మళ్లీ స్వగ్రామానికి చేరుకుని కళను ప్రదర్శించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని కల్పించిన సంగీత బృందానికి, కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ నులక రవీందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ నులక రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల విశేష ఆదరణతో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు. హాలియా ప్రాంతానికి చెందిన అఖిలేశ్వర్ రెడ్డి విజయాన్ని ఆదర్శంగా తీసుకుని మరెందరో యువ గాయకులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంద నరేందర్ రెడ్డి, కత్తి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల
# నిత్యావసరసరుకులు అందించాలి
### ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి



**కల్లూరు జూన్ 12(జనంసాక్షి)**
రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యవసర సరుకులు రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ అందించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఐద్వా సత్తుపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాచర్ల భారతి సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ షాప్ ల అందించే సరుకులను తగ్గించుకోవడం కోసం బోగస్ రేషన్ కార్డులు ఉన్నాయని దీనివల్ల ఆటంకం కలుగుతుందని తప్పించుకోవాలని చూస్తున్నదని విమర్శించారు .నిత్యావసర సరుకులు అందించేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. యుద్ధం పేరుతో కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల మీద భారాలు వేస్తూ ధనికులకు మాత్రం విమాన ఇంధనాలను తగ్గిస్తుందని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా పెంచిన పెట్రోలు డీజీలు గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, గృహజ్యోతి పథకం ద్వారా అందించే గ్యాస్ సిలిండర్లను 12కు తగ్గకుండా అందించాలని, లేనిపక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళనలు పోరాటాలు ఉద్ధృతం చేస్తామని చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు .అర్హులైన పేద ప్రజలందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ,భూమి లేని వారికి భూమి పంచాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సత్తుపల్లి డివిజన్ అధ్యక్షురాలు రత్నకుమారి,సత్తుపల్లి మండల కార్యదర్శి జాజిరి జ్యోతి,కల్లూరు మండలం అధ్యక్షురాలు బిరవల్లి తిరుమల,కరిష్మా, డివిజన్ కమిటీ సభ్యులు పుష్పవల్లి,షేక్ జాన్బీ షేక్ మౌలాబి ,కుర్రారపు రాజేశ్వరి,క్రాంతి ,భూలక్ష్మి,మాణిక్యం ,సుజాత ,శకుంతల ,మరియమ్మ, అగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ పై
# అవగాహన సదస్సు శిక్షణ శిబిరం
### నాగండ్ల దీపక్ చౌదరి




**ఖమ్మం కార్పొరేషన్ జూలై 12 ( జనంసాక్షి)**
ఈరోజు ఖమ్మం నగరంలోని గౌరవ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు గారి క్యాంపు కార్యాలయం నందు ప్రత్యేక సమగ్ర సవరణ పై అవగాహన సదస్సు శిక్షణ శిబిరం ఖమ్మం జిల్లా అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈకార్యంరమానికి పీ సి సి తరపున ముఖ్య అతిథిగా హాజరైన శిక్షణ శిబిర ఉపన్యాసకులు. బండి సుధాకర్ మాట్లాడుతూ ఫారం 6,6/o ద్వారా కొత్త ఓటర్లు నమోదు ఫారం 7 ద్వారా అభ్యంతరాలు చిరునామా మార్పుల కొరకు ఫారం 8 అదేవిధంగా ప్రస్తుత ఓటర్ల ధ్రువీకరణ కొరకు ఎన్యుమరేషన్ ఫారం లను ఉపయోగిస్తూ ఓట్లను కాపాడాల్సిన బాధ్యత ఎశ్రీజీ పైన ఆధారపడి ఉంటుంది, ఇంకా సమగ్రమైన వివరాల కొరకు మీకు ఒక బిక్కులెట్టును అందజేస్తున్నాం. ఆ బుక్లెట్ ఆధారంగా ప్రత్యేక సమగ్ర సవరణ పై అధ్యయనం చేసి స్థిరమైన ఓటర్ల ఓటును కాపాడాల్సిన బాధ్యత మీరంతా తీసుకోవాల్సిందిగా కోరుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ నియోజకవర్గం లో అభివృద్ధి సంక్షేమమును రెండు కళ్ళుగా భావించి హైదరాబాద్ కు దీటుగా ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్త పార్టీని ప్రభుత్వాన్ని ప్రజల్లోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఒక దేశం కానీ రాష్ట్రం కానీ అభివృద్ధి చెందాలన్నా సంక్షేమం వైపు అడుగులు వేయాలన్న ఆ దేశ పాలకుల పైన ఆధారపడి ఉంటుంది. మరి అటువంటి పాలకులను ఎన్నుకునే హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇవ్వటం జరిగింది. ఓటు హక్కు వచ్చిన ప్రతి ఓటరు ఆ ఓటుని కాపాడుకునే బాధ్యత దానిని సక్రమమైన మార్గంలో ఉపయోగించుకునే బాధ్యత కూడా ఓటర్ దే, కాబట్టి మనకు ఆధార్ కార్డు ఎంత ముఖ్యమైనదో అంతకంటే ఎక్కువ విలువైనది ఓటు కార్డు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కారణంగా ఎవరు ఓటు ఉంటుందో ఎవరి ఓటు పోతుందో అర్థం కాని పరిస్థితుల్లో ఓటర్లు ఉన్నారు. కాబట్టి ఒక ఓటరు ఓటు నిర్దేశించేది ప్రభుత్వ పరంగా బిఎల్ఓ లు పార్టీలపరంగా బి ఎల్ ఏ లు కాబట్టి పార్టీ నియమించిన బిఎల్ఎలు తమ పరిధిలో ఉన్న బూతులలో ఎన్ని ఓట్లు ఉన్నాయి సమగ్ర సవరణలో ఎవరు ఓటయినా అకారణంగా తొలగిస్తే తిరిగి దాన్ని ఏ విధంగా ఓటర్ లిస్టులో చేర్చాలి దానికి అనుసరించాల్సిన పద్ధతులు ఏంటి అని సవివరంగా బీఎల్ఏ లకు అవగాహన ఉండాలి. అలా ఉన్నప్పుడే ప్రతి ఓటుని కూడా కాపాడుకునే బాధ్యత బిఎల్ఏ పైనే ఉంటుంది. ఏదైనా ఓటు మీద ఎంక్వయిరీ కి వచ్చినట్లయితే అట్టి ఓటు లో ఏమి తేడాలు ఉన్నాయో గమనించి వాటిని సరిచేసి వాటికి కావలసిన పత్రాలను బిఎల్ఓ లకు అందజేసి ఆ ఓటును కాపాడాల్సిన బాధ్యత ప్రతి బిఎల్ఏ పైన ఉంటుంది . ఒక ఓటు ఫలానా బూతులో ఎప్పటినుండి ఉంటుంది గతంలో మీరు ఎక్కడ ఓటు వేశారు మీ పిల్లలు మీ తల్లిదండ్రులు ఓటు గతంలో ఎక్కడ ఉన్నది అనేది సమగ్రమైన వివరాలతో బిఎల్ఓ లకు అందించి ఓట్లు కాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బిఎల్ఏ పైన ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్య నారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ దుర్గాప్రసాద్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా ఏఎంసీ చైర్మన్ ఎరగర్ల హనుమంత రావు,తదితరులు మాట్లాడుతూ ఓటు చాలా విలువైనదని ఆ ఓటు సజీవంగా ఉండేటట్టు కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది అని ఎక్కడైనా ఏదైనా లోపాలు జరిగి ఓటుకి ఇబ్బంది కలిగిన ఎడల వాటిని సరి చేయాల్సిన బాధ్యత బి ఎల్ ఈ ల పైనే ఉంటుందని పార్టీ పరంగా నియమించబడిన బిఎల్ఎలు తమ కర్తవ్యాలని సమర్థవంతంగా నిర్వహించి ప్రతి పౌరుడి ఓటుని కాపాడవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ పునుకొల్లు నీరజ ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వరరావు రఘునాథపాలెం మండల అధ్యక్షుడు దేవ్ సింగ్, మాజీ కార్పొరేటర్లు, వివిధ హోదాలలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ గౌస్ పాషా,ఎర్రం బాలగంగాధర్ తిలక్, బాణాల లక్ష్మణ్ నరాల నరేష్ కోసూరు ప్రసాద్, పాలకుర్తి నాగేశ్వరరావు జమ్మిశెట్టి శ్రీనివాసరావు కోనేటి నారాయణ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# చేనులో పని చేస్తు వడదెబ్బ తగిలి రైతు మృతి



**టేకులపల్లి,జూన్ 12(జనంసాక్షి):**
వ్యవసాయ పనులు ప్రారంభమవడంతో చేనులో పనిచేస్తూ ఓ రైతు వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపై మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని శుక్రవారం లచ్చ తండాలో జరిగింది. లచ్చ తండా గ్రామానికి చెందిన జాటోత్ భీమ్లా (45) శుక్రవారం ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.... జాటోత్ భీమ్లా తన వ్యవసాయ పొలంలో పత్తి గింజలు వేస్తుండగా తీవ్ర ఎండ కారణంగా వడదెబ్బ తగిలి ఒక్కసారిగా అస్వస్థతకు గురై సృహ కోల్పోయారు. కుటుంబ సభ్యులు, పక్క చేనులో పనిచేస్తున్న కొంతమంది స్థానికులు వెంటనే ఆయన దగ్గరకు చేరుకొని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు కుటుంబ పోషణ కోసం వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించేవారని గ్రామస్థులు తెలిపారు. జాటోత్ భీమ్లాకి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో భార్య, పిల్లలు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. వడదెబ్బ కారణంగా జరిగిన ఈ ఘటన పట్ల గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు. ఇంటి యజమాని వడదెబ్బకు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని పలువురు కోరారు.

# మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ పై నిరసన
### - సిబిఐ విచారణ జరిపించి కుట్రదారులను తేల్చండి
### - బూసిరెడ్డి శంకర్ రెడ్డి



**భద్రాచలం జూన్ 12 (జనంసాక్షి)**
మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ పై సిబిఐ విచారణ జరిపించాలని, దోషులు ఎవరో తేల్చాలని భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తన అనుచరులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి గత 12 సంవత్సరాల నుంచి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నరేంద్ర మోడీకి ఇది పెద్ద కళంకమని మీనాక్షి నటరాజన్ పై తెలంగాణలో నమోదు కాని కేసును ఆధారంగా తీసుకొని కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన మహిళ మీనాక్షి నటరాజన్ అని,ఆమె ఎదుగుదలను ఓర్వలేక చేసిన ఈ ద్రోహం, కుట్ర మామూలు విషయం కాదని తీవ్రంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సిబిఐ విచారణ జరిపించి ఈ కుట్రకి పాల్పడ్డ దోషులు ఎవరు తేల్చాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని బూసిరెడ్డి శంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నాలుగు తరాల ‘మధుర జ్ఞాపకం”
### ‘స్మృతి’ వేడుకలో 30 కుటుంబాల రాకతో వెల్లివిరిసిన ఆనందం



**బూర్గంపహాడ్ జూన్ 12 (జనంసాక్షి):** ఒక తరం కష్టపడి సంపాదిస్తే... మరో తరం కాపాడుతుంది... ఒక తరం పెంచుతుంది. ఒక తరం ముందుకు తీసుకుపోతుంది. ఈ బంధం తెగకుండా చూసుకునే బాధ్యత తరతరాల కుటుంబానిది.. నాలుగు తరాలు ఒకేచోట కలిస్తే ఆ దృశ్యం చూడముచ్చటగా ఉంటుంది... అదే బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంర్ కు చెందిన మార్తి తిరుపతయ్య... రామలక్ష్మి కుటుంబ దృశ్యం శుక్రవారం పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఓ ఫంక్షన్హాల్లో ఆవిష్కృతమైంది. మార్తి తిరపతయ్య, రామలక్ష్మి దంపతులు కాలం చేసి 30 ఏళ్లు గడిచిపోవడం... ఆ తర్వాత కుమారులు వెంకటేశ్వర్లు, మార్తి నాగయ్యలు కూడా చనిపోవడం... వెంకటేశ్వర్లు 16వ వర్ధంతిని పురస్కరించుకుని... మార్తి తిరుపతయ్య.. రామలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థ సమ్మేళనంగా భావించి నాలుగు తరాలకు చెందిన కుటుంబంలో కుమారులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లు ఇలా మొత్తం 150 మంది స్మృతి సమ్మేళనం నిర్వహించారు. మార్తి నాగరాజు, నాగేంద్రప్రసాద్, జాని, కిస్మత్ రావు, గోతం ముతేష్, ఎనుముల వెంకటేష్లు తరతరాల కుటుంబ సభ్యులను ఒక వేదిక మీదకు తీసుకువచ్చేందుకు నిర్వహణ బాధ్యతను తలకెత్తుకుని 30 కుటుంబాల వారంతా ఒక గొడుకు కిందకు వచ్చేలా కష్టపడ్డారు. వర్ధంతి సందర్భంగా అందరూ హాజరనైప్పటికీ నాలుగు తరాలు ఒకేచోట కలిసి చిన్ననాటి స్మృతులు...ముచ్చట్లు చెప్పుకోవడం ఒకింత ఆనందాన్ని కలిగించిందని వారంతా ఉద్వేగంతో పొంగిపోయారు. ఈ వేడుకలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఆనందంగా గడిపి సహఫంక్తి భోజనం చేయడంతో ఈ వేడుక ముగిసింది.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం..

## డి.ఎల్.ఎస్ ఎ సెక్రటరీ రాజేందర్




**మణుగూరు, జూన్ 12 (జనంసాక్షి):** దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అనేక కుటుంబాలవారు తమ పిల్లలను డబ్బు సంపాదించడానికి పనిలో పెడుతున్నారని డి.ఎల్.ఎస్ ఎ సెక్రటరీ రాజేందర్ అన్నారు. శుక్రవారం బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మణుగూరు శ్రీవిద్య జూనియర్ కళాశాల లో బాలల కార్మిక వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాల్పోస్టర్ ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థ ఇప్పటికీ అత్యంత సాధారణంగా కనిపిస్తోంది. కర్మాగారాలు, గనులు, తోటలు, వ్యవసాయం, తల్లిదండ్రుల వ్యాపారాల్లో సాయం చేయడం, చిన్న వ్యాపారాలు, ఆహార పదార్థాల విక్రయం లేదా తాత్కాలిక ఉద్యోగాల్లో బాలలు పని చేస్తున్నారు. కొంత మంది బాలలు పర్యాటకులకు గైడ్లుగా, దుకాణాలకు, రెస్టారెంట్లకు వెయిటర్లుగా పని చేస్తున్నారు. వ్యాపారాలను నడపడానికి. బూట్లు పాలిష్ చేయడం, అంగడి ఉత్పత్తులను మోయడం లేదా శుద్ధి చేయడం వంటి దుర్భరమైన పనులకు బాల కార్మికులను పనిలో పెట్టుకుంటున్నారు. 14 సంవత్సరాలలో పిల్లలు బాల కార్మికులు ఎక్కడైనా పని చేసినట్లయితే తక్షణమే 1098 గాని, 100 గానీ చైల్డ్ లైన్ విభాగానికి సమాచారం అందించాలని డి .ఎల్.ఎస్. ఏ సెక్రటరీ రాజేందర్ ప్రజలకు సూచించారు..

**సీఐ నాగబాబు మాట్లాడుతూ..**

చేతులు చాస్తూ? బరువులు మోస్తూ? బాల్యాన్ని భారంగా మోస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 22 శాతం మంది బాలలున్నారు. పుస్తకాలు పట్టుకోవలసిన చేతులు ఇటుకలు మోస్తున్నాయి. కాఫీ హోటళ్లలో కప్పులు కడుగుతున్నారు. మద్యం దుకాణాలలో సేవలు అందిస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అనేక కుటుంబాలవారు తమ పిల్లలను డబ్బు సంపాదించడానికి పనిలో పెడుతున్నారు. బాల కార్మికులుగా పని చేస్తున్న చిన్నారుల సగటు వయస్సు 6 నుండి 14 సంవత్సరాల మధ్య ఉంటుంది. కడుపు నింపుకోవడానికి విద్యకు దూరమై పనిచేస్తున్నారు. ఎక్కువ మంది బాల కార్మికులను అనధికారిక రంగంలో ఉపయోగిస్తున్నారు. వీధుల్లో అనేక వస్తువులను విక్రయించేందుకు ఉపయోగించుకోవడం, రహస్యంగా ఇళ్లలో, అపార్ట్మెంట్లలో పరిశ్రమలలో పని చేయడం వలన బాల కార్మికులకు వివిధ రకాల చర్మ వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. ఈ బాల కార్మికులు పెరిగి పెద్దయ్యాక వారు శారీరకంగా బలహీనులు కావచ్చు. అందుకోసం కొన్ని పరిశ్రమలలో బాల కార్మికులను పెట్టుకోరాదని చట్టం పేర్కొంటోంది. కాబట్టి ప్రతి ఒక్కరూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో సీఐ నాగబాబు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటిడెంట్ గౌరీ ప్రసాద్, కార్మిక శాఖ అధికారి బి యన్ రాజు ఏ.ఎల్ .ఓ రజిత, సుశీల, ఇందిరా, హైమావతి, భద్రమ్మ, శ్రీను, కోటేష్, రాజేష్, మోహన్ జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

- కార్మికులు ఎక్కడైనా పని చేసినట్లయితే 1098 లేదా100 డయల్ చేయండి..
- వయస్సు 6 నుండి 14 సంవత్సరాల పిల్లలను బడిలో చేర్పించండి..

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బీఎల్ ఎ లకు అవగాహన కార్యక్రమం

**భద్రాచలం జూన్ 12 (జనంసాక్షి)**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన కల్పించేందుకు భద్రాచలంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, బీఎల్ఏల బాధ్యతలు, ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, అభ్యంతరాల పరిష్కార విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నలు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ ఎ లు చురుకైన పాత్ర పోషించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని నాయకులు దిశానిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి పొడెం వీరయ్య కి వినతి..



**భద్రాచలం జూన్ 12 (జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామకాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ శాసనసభ్యులు పొదెం వీరయ్యకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని 37 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 20 వేల పోలీస్ పోస్టులకు సంబంధించి నియామక నోటిఫికేషన్ ను వెంటనే విడుదల చేసేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా నియామకాల ప్రక్రియలో జరిగిన జాప్యంతో అనేక మంది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అభ్యర్థులు సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన పొదెం వీరయ్య వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# నకిలీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి

## సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్

**టేకులపల్లి, జూన్ 12(జనంసాక్షి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమాయక రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్న నకిలీ విత్తనాల విక్రయాలను అరి కట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన సేవాలాల్ సేన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో టాస్క్ఫోర్స్ తనిఖీలు కేవలం నామమాత్రంగా సాగుతున్నాయని, దీంతో నకిలీ విత్తన మాఫియా యథేచ్ఛగా వ్యవహరించే పరిస్థితి నెలకొన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు, టాస్క్ఫోర్స్ బృందాలు ఫెర్టిలైజర్ దుకాణాలపై అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించడం కాకుండా, ప్రతిరోజూ మండలాల వారీగా పర్యటిస్తూ నిరంతర నిఘా ఉంచాలని కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వయంగా రంగంలోకి దిగి అన్ని ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్సులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రతి ఫెర్టిలైజర్ షాపు లో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ బోర్డుల్లో సంబంధిత షాపు లైసెన్స్ వివరాలు, విక్రయానికి అనుమతి పొందిన విత్తన కంపెనీల పేర్లు, అందు బాటులో ఉన్న విత్తన రకాలు, స్టాక్ వివరాలు, ధరలు, సంబంధిత అధికారుల ఫిర్యాదు నంబర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని అన్నారు. ముఖ్యంగా పత్తి విత్తనాల విక్రయంలో లైసెన్స్ పొందిన కంపెనీల విత్తనాలే అమ్ముతున్నారా లేదా అనే అంశంపై ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని కోరారు. రైతులు భారీ పెట్టుబడులు పెట్టి సాగు ప్రారంభించే ఆరంభంలోనే నకిలీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారుల ను కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, సేవాలాల్ రైతు సేన నాయకులు ధరావత్ కృష్ణ నాయక్, బానోతు నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలకు పంపుదాం

## వారి కలలకు రెక్కలు తొడుగుదాం



**టేకులపల్లి,జూన్ 12 (జనంసాక్షి):**

ప్రతి సంవత్సరం జూన్ 12 న ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మా తెలిపారు. చిన్నారుల హక్కులను పరిరక్షించడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమాజంలో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ప్రతి చిన్నారికి చదువుకునే హక్కు, ఆడుకునే హక్కు , సురక్షితమైన బాల్యాన్ని గడిపే హక్కు ఉంది. కానీ పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక అసమానతల కారణంగా ఇంకా ఎంతోమంది చిన్నారులు బాల కార్మికులుగా మారు తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. పనిలో ఉన్న చిన్నారిని చూసినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అం దించడం కూడా మన సామాజిక బాధ్యత. చట్టాలు ఉన్నప్ప టికీ హోటళ్లు, టీ దుకాణాలు, ఇటుక బట్టీలు, వ్యవసాయ రంగం, పరిశ్రమలు, గృహ పనులు వంటి అనేక రంగాల్లో బాల కార్మికులు లేకుండా చేయాలి. చిన్నారి చేతిలో పుస్తకం ఉండాలి... పనిముట్టు కాదు. బాల్యం పనికోసం కాదు... బంగారు భవిష్యత్తు కోసం. ప్రతి చిన్నారిని పాఠశాలకు పంపుదాం... వారి కలలకు రెక్కలు తొడుగుదాం. బాల కార్మిక వ్యవస్థ లేని సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం అని తెలంగాణ దివ్యాంగ , ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మా తెలిపారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

## ట్రాఫిక్ ఎస్సై తిరుపతిరావు

**భద్రాచలం జూన్ 12 (జనంసాక్షి)**

రోడ్డుపై ప్రయాణించే ప్రతి పౌరుడు రోడ్డు భద్రత నియమాలను పాటస్తూ ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం భద్రాచలం యుబి రోడ్ ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఫుట్పాత్ను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు, ఏఎస్ఐ శంకర్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ వినోద్ కుమార్, షమీ పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి జీవో-51 సవరించాలని డిమాండ్

**భువనగిరి, జూన్ 12 (జనంసాక్షి)**

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి జీవో నెం.51ను సవరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం యాదాద్రి-భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పైళ్ల గణపతి రెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు కార్మికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని విమర్శించారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే కేటగిరీల వారీగా విధులు కొనసాగించాలని, కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు రెండో పీఆర్సీ అమలు చేసి వేతనాలు పెంచాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకటో తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయడంతో పాటు పదో తరగతి అర్హత, ఐదేళ్ల అనుభవం ఉన్న కార్మికులకు పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి రాము, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూరల కిష్టయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, పోచంపల్లి మండల కన్వీనర్ మంచాల మధు, రాష్ట్ర కమిటీ సభ్యుడు స్వామి, మండల నాయకులు బొల్లెపల్లి స్వామి, బాబు, జ్ఞానేశ్వర్, గోసంగి పరమేష్, గాదె ఎల్లయ్య, చంద్రకాంత్, పాపయ్య, రమేష్, రేణుక, వీరస్వామి, బాలరాజు, పుష్ప, అరుణ, కవిత, లక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.





# యువకులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

### హుజూర్ నగర్ ఎస్ఐ : చలికంటి నరేష్

**హుజూర్‌నగర్ జూన్ 12 (జనంసాక్షి) :**

యువకులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరా సెంటర్ లో ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ యువకుల చేత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బలరాంరెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలి

### - ఎస్సై చలికంటి నరేష్

హుజూర్ నగర్, (జనంసాక్షి): రోడ్డు నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని హుజూర్ నగర్ పట్టణ ఎస్సై చలికంటి నరేష్ అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ పట్టణంలోని ఇందిరా సెంటర్లో యువకుల చేత ఎస్సై నరేష్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ యువకులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బలరాంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రభుత్వ బడిలో చేరితే ఇంటి పన్ను మాఫీ

### విద్యార్థుల చేరికల పెంపునకు తాజ్‌పూర్ సర్పంచ్ వినూత్న నిర్ణయం

### సర్పంచ్ సంతోష్ శ్రీనివాస్ నిర్ణయానికి గ్రామస్తుల హర్షం

**భువనగిరి, జూన్ 12 (జనం సాక్షి)**

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల చేరికల పెంపు లక్ష్యంగా యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గ్రామ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించిన కుటుంబాలకు ఇంటి పన్ను మినహాయింపు కల్పించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే సుమారు రూ.15 లక్షల స్వంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ “బడి బాట” కార్యక్రమంలో భాగంగా పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయ బృందంతో కలిసి గడపగడపకు వెళ్లి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి విద్యా వ్యవస్థ మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ఇంటి పన్ను మినహాయింపు పథకాన్ని అమలు చేస్తున్నామని, దీనికి సంబంధించిన మొత్తాన్ని గ్రామ పంచాయతీకి తానే స్వయంగా చెల్లిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డా. ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధమల్ల లింగస్వామి మండిపాటు

**మోటకొండూరు,జూన్ 13 (జనం సాక్షి):**



ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని బహుజన్ సమాజ్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల లింగస్వామి మండిపడ్డారు. మోటకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న విద్యాశాఖలోనే ఇలాంటి అక్రమాలు జరగడం ప్రభుత్వం యొక్క పనితీరుకు అద్దం పడుతోందని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు లక్షల్లో డొనేషన్లు వసూలు చేస్తూ అడ్డగోలుగా దందా సాగిస్తున్నాయని, వాటిని వెంటనే కంట్రోల్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వివరాలను ప్రభుత్వమే ఖరారు చేస్తూ తక్షణమే సరికొత్త జీవో ( జారీ చేయాలి, నిబంధనలను మించి ఫీజులు వసూలు చేసే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ స్కూళ్లలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడటంతో పాటు, అక్కడ పనిచేసే టీచర్ల విద్యార్హతలను కూడా అధికారులు నిరంతరం తనిఖీ చేయాలనీ డిమాండ్ చేశారు.

# కె ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**



కె ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిల్ యువసేన ద్వారా పులిపాటి శ్రీనుకు శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. కె ఎస్ ఆర్ ఫౌండేషన్ అధినేత క్రీస్తు శేషులు కస్తాల శ్రవణ్ కుమార్ 11వ వార్డు మాజీ కౌన్సిలర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, పుట్టినరోజు సందర్భంగా తమ్ముడు దిల్ యువసేన ద్వారా హుజూర్ నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డు లో సైకిల్ షాప్ నడుపుకుంటున్నటువంటి పులిపాటి శ్రీను పరిస్థితి తెలుసుకొని రెండు రైస్ బ్యాగ్ లు, నిత్యవసర సరుకులు కె ఎస్ ఆర్ ఫౌండేషన్, దిల్ యువసేన ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో దిల్ యువసేన సభ్యులు కస్తాల దిల్, గోపాల్ దాస్ కిరణ్, వీరబాబు, గుట్ట వెంకటేష్, మందా అరవింద, చింతిరాల చింటూ తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదవశాత్తు గాయపడిన పలువురుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

**హాలియా జనం సాక్షి జూన్ 12**

అనుముల మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఊడ్తూరు రవీందర్ రెడ్డి గారు (గ్రామ పంచాయతీ కార్యదర్శి) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడం వలన వారి నివాసానికి వెళ్లి పరామర్శించడం జరిగింది. అలుగుల వెంకట్ రెడ్డి (వార్త విలేకరి ) ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడడం వలన వారి నివాసానికి వెళ్లి పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కర్ణ నర్సి రెడ్డి, మాజీ పట్టణం అధ్యక్షులు వడ్డే సతీష్ రెడ్డి, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నల్గొండ సుధాకర్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, సర్పంచ్ కూన్ రెడ్డి భాస్కర్ రెడ్డి , పంగ లక్ష్మణ్, బొమ్మిశెట్టి ఆంజనేయులు, నర్సింగ్ శ్రీను,గడ్డం సోము, నల్లమెట్టి భాస్కర్, మొహ్మద్ తౌసిఫ్ అలీ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..